సాక్షి
కాకినాడ
సోమవారం । 13 । జనవరి । 2025



కోటసత్తెమ్మ తల్లికి వెండి బిందె


నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసి యున్న కోటసత్తెమ్మ అమ్మవారికి ఎంపీ శ్రీనివాస రావు, కుటుంబ సభ్యులు (కొవ్వూరు) ఆదివారం 500 గ్రాముల వెండి బిందె సమర్పించారు.



అమలాపురంలో భారీ చోరీ

స్థానిక కురసాలవారి వీధిలో శనివారం అర్ధ రాత్రి దాటిన తర్వాత భారీ చోరీ జరిగింది. కోలా శేషు ఇంట్లో దొంగలు చొరబడి రూ.10.50 లక్షల సొత్తు దోచుకున్నారు.

డెల్టాకు 12,040 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 12,040 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 5,800 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది.

చిన్నబోతున్న పెద్ద పండగ

- గ్రామాల్లో కానరాని సంక్రాంతి సందడి
- గత వైఎస్సార్ సీపీ పాలనలో విస్తృతంగా సంక్షేమం
- జనం చేతిలో పుష్కలంగా డబ్బు
- ఉత్సాహంగా షాపింగులు.. జోరుగా వ్యాపారాలు
- నేడు కూటమి పాలనలో అందని పథకాలు
- ఆర్థిక ఇబ్బందులతో పండగ ఖర్చుకు వెనకాడుతున్న జనం
- సాక్షి విలేజ్ విజిట్‌లో వెల్లడి

సామర్లకోట ఏడీబీ రోడ్డులో.. కాకినాడకు ఏడెనిమిది కిలోమీటర్ల దూరాన.. పచ్చని పంట పొలాల మధ్య ఉన్న వెంకట కృష్ణరాయపురం (వీకే రాయపురం) ఓ చిన్న పల్లెటూరు. జనాభా 8 వేలు. గ్రామంలో 90 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. ఊరంతా రైతులు, వ్యవసాయ కూలీలే. ఏటా ఈ సమయానికి ఈ గ్రామం సంక్రాంతి సందడితో తుళ్లిపడుతూ ఉండేది. నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలితంగా జనం చేతుల్లో పుష్కలంగా డబ్బులుండేవి. దీంతో సంక్రాంతి పండగను సంబరంగా నిర్వహించుకునేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం ఊసే లేకపోవడంతో ఈసారి ఈ మూడు రోజుల పెద్ద పండగ కాస్తా చిన్నబోతోంది. ఒక్క వీకే రాయపురమే కాదు.. దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

– సాక్షి ప్రతినిధి, కాకినాడ



సామర్లకోట మండలంలోని వీకే రాయపురంలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్లు.. కానరాని సంక్రాంతి సందడి

విలేజ్ విజిట్

సామర్లకోట మండలంలోని చిన్న గ్రామ పంచాయతీ వీకే రాయపురం. సంక్రాంతి పండగ శోభతో ఇప్పటికే ఈ గ్రామం కళకళలాడాల్సి ఉంది. ప్రస్తుతం గ్రామంలో ఆ కళ ఎక్కడా కానరావడం లేదు. పండగంటే ఉరకలెత్తే ఉత్సాహం.. కేరింతలు కనిపించడం లేదు. వీకే రాయపురంలోని నాలుగు వీధుల్లో సాక్షి ఆదివారం మూడు గంటల పాటు నిర్వహించిన 'విలేజ్ విజిట్' సందర్భంగా గ్రామంలో ఎవరిని కదిపినా ఆరు నెలల్లో ఎంత మార్పు వచ్చేసిందంటూ ఆవేదన వ్యక్తం చేసిన వారే కనిపించారు. 'సాక్షి'కి ఎదురుపడిన ఏ ఒక్కరిలోనూ తెల్లవారితే భోగి పండగ.. అనే సంతోషమే కనిపించ లేదు. గత ఏడాది సంక్రాంతి పండగకు చేతినిండా సొమ్ముతో హుషారుగా గడిపిన ఈ గ్రామంలో ఈసారి ఆ సరదాలే కరవయ్యాయనే ఆవేదనే ప్రతి ఒక్కరిలో కనిపించింది. వీకే రాయపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సత్యవరపుపేటలో ఏడెనిమిది వందల గడప ఉంటుంది. అంతా ఎస్సీ, బీసీ వర్గాలే. చిన్నా చితకా కౌలు వ్యవసాయం చేస్తుంటే.. మూడు వంతుల మంది వ్యవసాయ కూలీలే. ప్రభుత్వం మారిన ఆరు నెలల్లో ఎంతో మార్పు వచ్చేసిందన్న ఆవేదన వారి మాటల్లో స్పష్టంగా కనిపించింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ.. గడచిన ఆరు నెలల కూటమి పాలనను స్థానికులు బేరీజు వేసుకుంటున్న తీరు ఈ 'విలేజ్ విజిట్'లో ప్రస్ఫుటంగా కనిపించింది

ఈసారి సంబరమే లేదు

వేగుళ్లమ్మ గుడి వీధికి వెళ్దామనుకుంటూండగా ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో పని చేసి రిటైరైన ఆముదాల వెంకట రమణ సాక్షికి ఎదురు పడ్డారు. సంక్రాంతి పండగ స్పెషల్ ఏమిటని మాట కలిపేసరికి.. 'సంక్రాంతి ఏముంటుంది? చేతిలో సొమ్ము లేకుండా పండగ ఎలా జరుపుకొంటాం? మా ఊళ్లో సంక్రాంతి కన్నుల పండువగా చేసుకునే వారు. ఈసారి



సంబరాలు అలా కనిపించడం లేదు' అని చెప్పారు. 'ఫ్యామిలీ డాక్టర్ ఇంటికి వచ్చి, బీపీ, సుగర్ చెక్ చేస్తున్నారా?' అని అడిగితే 'అసలు డాక్టర్ వస్తేనే కదా.. అవన్నీ చూడటానికి! ఇదివరకులా ఉప కేంద్రానికి వెళ్లక తప్పడం లేదు' అని ఒకింత బాధతో అన్నారు.

డబ్బు లేకుండా పండగా!

బోయనపూడి రోడ్డులో వెళ్తూండగా పెద్ద పెద్ద మీసాలతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఇంటి సత్యనారాయణ కనిపించారు. ఆయన ఒకప్పుడు ధాన్యం కమీషన్ వ్యాపారం చేసేవారు. 'తెల్లవారితే భోగి పండగ కదా! గ్రామంలో సంక్రాంతి సందడి ఎక్కడా కనిపించడం లేదే'మని సాక్షి మాట కలిపింది. 'చేతిలో డబ్బు లేకుండా పండగ ఎక్కడి నుంచి వస్తుంది? ఇంటికి వచ్చిన వారిని భోజనం చేయండి అనడానికి.. భోజనం చేస్తారా అనడానికి ఎంత తేడా ఉంటుందో గమనించండి. మా ఊళ్లో ఇప్పుడు అలానే కనిపిస్తోంది' అని చెప్పారు.





ఏలేరు కాలువ వంతెన దాటి వీకే రాయపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సత్యవరపుపేటకు వెళ్లేసరికి మామిడి అప్పలకొండ ఎదురు వచ్చారు. 'ఇంటి పన్ను నా పేరిట మార్చాలని మూడు నెలలుగా తిరుగుతున్నా పని కావడం లేదు. వారడిగిన అన్ని సర్టిఫికెట్లు ఇచ్చినా తిప్పుకుంటున్నారే తప్ప పేరు మార్చడం లేదు. అదే జగన్ ప్రభుత్వంలో ఇటువంటి పనులన్నీ వలంటీర్లు చూసుకునే వారు. వారు లేని లోటు ఇప్పుడు కనపడుతోంది. వీకే రాయపురం సొసైటీకి ఎరువులు, పిండి (యూరియా) వచ్చాయంటే తెలియకుండానే అయిపోతున్నాయి, ఇదివరకు వలంటీర్ వచ్చి చెప్పేవాడు' అని ఆవేదనగా అన్నారు.

గల్లా పెట్టె నిండటం లేదు





బోయనపూడి రోడ్డు శివారున మోడ్రన్ రైస్ మిల్లు ఉంది. చుట్టుపక్కల నాలుగైదు గ్రామాల వారికి అదొక్కటే మిల్లు. ఇందులో ధాన్యం, అటుకులు, పిండి, నూక, ఆయిల్ మర పడతారు. చాలా ఏళ్లుగా ఆ మిల్లు నడుపుతున్న రేలంగి రాంబాబు, వెంకటలక్ష్మిలను మిల్లు ఎలా నడుస్తోందని సాక్షి పలకరించింది. 'గత ఏడాది సంక్రాంతికి వారం రోజుల ముందు నుంచే మిల్లు కిక్కిరిసిపోయి ఉండేది. అసలు ధాన్యం బస్తాలు మర పట్టడానికి కూడా సమయం లేక పక్కన పెట్టేసే వాళ్లం. పండగ పిండి వంటలకు మాత్రమే సరకులు మర ఆడేవాళ్లం. గత ఏడాది సంక్రాంతికి అమ్మ ఒడి, రైతులకు పెట్టుబడి సాయం, మహిళా సంఘాలకు వడ్డీ రాయితీతో పాటు ప్రభుత్వం అందించిన సొమ్ము జనం వద్ద ఆడేది. అప్పట్లో వంట చేసుకోవడానికి ఇంటికి వెళ్లే తీరిక కూడా లేక మిల్లులోనే ఉండిపోయే వాళ్లం. ఈసారి సంక్రాంతికి వారం ముందు నుంచి రోజుకు నలుగురైదుగురికి మించి మిల్లుకు రావడం లేదు. అప్పట్లో అరగంట మిల్లు ఆడేసరికి గల్లా పెట్టె నిండిపోయేది. ఇప్పుడు అందులో సగం కూడా నిండటం లేదు. ఇంక సంక్రాంతి ఎలా ఉంటుంది?' అని పెదవి విరిచారు. 'నిజంగా చెప్పాలంటే ఆ రోజులే వేరులెండి'అని వెంకటలక్ష్మి అన్నారు. 'అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు పెంచేది లేదని చంద్రబాబు చెప్తే నిజమని నమ్మాం. తీరా గతంతో బిల్లులు పోల్చి చూస్తే గుండె గుభేల్‌మంటోంది' అని మిల్లు యజమాని రేలంగి రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గత విద్యుత్ బిల్లు రూ.4,500 వస్తే ఈ నెలలో రూ.6 వేలు దాటేసిందని, ఇలాగైతే మిల్లు నడపడమే కష్టమని చెప్పారు.



ఏరులై పారుతున్న మద్యం

వీకే రాయపురంలో అక్కడక్కడ చిన్న సోడా కొట్లు, పచారీ దుకాణాలు, అటుకుల మిల్లులు కనిపించాయి. కానీ, గ్రామంలో మూడు వైపులా మూడు బెల్ట్ షాపులు మాత్రం దర్శనమిచ్చాయి. ఇదివరకు గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరాన ఉండూరు రైల్వే జంక్షన్‌లో ఒకే ఒక్క మద్యం దుకాణం ఉండేది. దూరంగా ఉండటంతో మద్యపాన **ప్రియులు రెండు** రోజులకోసారి అక్కడకు వెళ్లి **మద్యం తాగేవారు.** మళ్లీ అంత దూరం వెళ్లలేక ఆగి**పోయేవారు. అ**టువంటిది ఇప్పుడు ఈ గ్రామం **లోనే నాలుగడుగు**లేస్తే బెల్ట్ షాపులు దర్శనమిస్తు**న్నాయి. రోజంతా** కష్టపడితే ఏడెనిమిది వందల **రూపాయలు వస్తా**ంటే అందులో సగం మద్యానికి **తగలేస్తున్నారని** అప్పలకొండ తదితరులు ఆవేద**నతో చెప్పారు.**

వియ్ ఆర్ టాకింగ్ ఇన్ ఇంగ్లిష్

సత్యవరపుపేట నుంచి తిరిగి వీకే రాయపురం సెం**టర్‌కు వస్తూండ**గా మార్గం మధ్యలో ఇద్దరు చిన్నా**రులు కనిపించి** హలో గుడాఫ్టర్‌నూన్ సార్ అంటూ చిరునవ్వుతో పలకరించారు. వీరు సత్యవరపుపేటకు చెందిన వ్యవసాయ కూలీలు పైలా తలుపులయ్య, రాణి దంపతుల కుమార్తెలు హాసిని, వేగవర్షిణి. ఈ ఇద్దరూ ఎంపీపీ స్కూల్‌లో 5, 3 తరగతులు చదువుతున్నారు. జగనన్న మా స్కూల్‌లో పిల్లలకు నేర్పించిన ఇంగ్లిషుతోనే ఇలా మాట్లాడుతున్నామని వారు చెబుతున్నప్పుడు వారి కళ్లల్లో ఒకింత ఆనందం కనిపించింది.

రైతు చేతిలో డబ్బుంటేనే కదా పండగ!



గ్రామంలోని ఆంజనేయస్వామి జంక్షన్‌కు వెళ్లేసరికి ఐదెకరాల రైతు వెలమర్తి బుల్లిరాజు 'సాక్షి'కి తారసపడ్డారు. ఆయనతో మాట కలపగా.. ఇద్దరు పిల్లలకు వివాహం చేశానని, ఎవరి కుటుంబాలు వారు చూసుకుంటున్నారని చెప్పారు. వ్యవసాయం ఎలా ఉందని, ఎక్కడా పండగ వాతావరణం కనిపించడం లేదేమని అడగగా.. గత ఏడాది సంక్రాంతికి ముందు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయంగా రూ.7,500 వేసింది. పంటల దిగుబడి బాగుండి, సంతోషంగా సంక్రాంతి చేసుకున్నాం. ఈసారి 'రైతుల చేతుల్లో డబ్బుల్లేవు. డబ్బులుంటేనే కదా పండగ కనిపించేది' అని నిర్వేదంగా అన్నారు. నా వరకూ చూసుకుంటే తొలకరిలో ముంపుతో జగ్గమ్మ తోటలో వరి పంట నష్టపోయాను. నష్టం లెక్కలేసుకుని వెళ్లారే తప్ప పైసా పరిహారం ఇవ్వలేదు. ఎకరాకు 40 బస్తాలు రావాల్సి ఉండగా.. 28 బస్తాలు మించి దిగుబడి రాలేదు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీరలేదు. పంట నష్టపోతే ఇక చేతిలో డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి? పండగ ఎలా జరుపుకొంటాం? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

రత్నగిరిపై నేడు సంక్రాంతి వేడుకలు



తామర, కలువ పూల కొలను వద్ద సత్యదేవుని నమూనా విగ్రహాలు

అన్నవరం: సత్యదేవుని సన్నిధి**న రత్నగిరిపై** సోమవారం సంక్రాంతి సంబ**రాలు ఘనంగా** నిర్వహించనున్నారు. భోగి పండగ సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటలకు రామాలయం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో తుని తపోవనం స్వామీజీ సచ్చిదానంద సరస్వతి భోగి మంట వెలిగిస్తారని అధికారులు తెలిపారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం సంక్రాంతి విశిష్టతపై భక్తులనుద్దేశించి స్వామీజీ ప్రసంగిస్తారు. సంక్రాంతి వేడుకలకు రత్నగిరిపై సత్యదేవుని ఆలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఏఈఓ కె.కొండలరావు ఆధ్వర్యాన రామాలయం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో భోగి మంటకు, జానపద కళారూపాల ప్రదర్శనలకు ఏర్పాటు చేశారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు, గ్రామీణ వాతావరణం ప్రతిబింబించేలా తాటి ఆకులతో వేసిన గుడిసె, కొబ్బరి చెట్టు, ఈత చెట్టు, తాటి చెట్టు, తామర, కలువ పూలతో కూడిన కొలను, ధాన్యపు రాశి, బావి, రచ్చబండ, కోడి పుంజులు, ఎడ్లబండి, పొట్టేలు, ఆవు దూడ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు తెలుగు జానపద కళారూపాలైన గంగిరెద్దుల వాళ్లు బుడబుక్కల సాయిబు, జంగమ దేవర, కొమ్మదాసరి తదితరులు కూడా సందడి చేయనున్నారని అధికారులు తెలిపారు. వీటితో పాటు సత్యదేవుని వార్షిక కల్యాణ వేదిక మీద సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను భక్తులు దర్శించేందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్నారు. స్వామివారి ఆలయాన్ని, రాజగోపురాలను విద్యుద్దీపాలతో, పూలమాలలతో అలంకరిస్తున్నారు. భోగిపళ్లు వేసేందుకు గాను చిన్నారులకు ఉదయం 9 గంటలకు సంక్రాంతి సంబరాల వద్దకు తీసుకుని రావాలని అధికారులు కోరారు. దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు సంక్రాంతి వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు.

అరుదైన కళబోత

- కొత్తపేటలో రేపే సంక్రాంతి ప్రభల ఉత్సవం
- 24 గంటల పాటు నిరంతరాయంగా ప్రభల ఊరేగింపు
- సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ ఎత్తున బాణసంచా కాల్పులు
- రెక్కలు కట్టుకుని వాలనున్న అతిథులు
- ఆర్డీఓ, డీఎస్పీల పర్యవేక్షణలో శాంతిభద్రతల పర్యవేక్షణ



కొత్తపేటలో ప్రభల ఊరేగింపు (ఫైల్)

కొత్తపేట: నయనానందం.. శ్రవణానందం.. కలబోసినది 'కొత్తపేట ప్రభల ఉత్సవం'. రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఈ సంక్రాంతి ప్రభల ఉత్సవం కొత్తపేటకు కీర్తి కిరీటం. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వ్యాప్తంగా కనుమ పండగనాడు ప్రభల ఉత్సవాలు నిర్వహిస్తుండగా.. కొత్తపేట ప్రభల ఉత్సవాలు మాత్రం మకర సంక్రాంతి రోజునే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సుమారు 500 సంవత్సరాలకు పూర్వం నుంచి ఇక్కడ ప్రభల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పాత రామాలయం, కొత్త రామాలయం వీధుల పేరుతో ఇక్కడ ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. పాత రామాలయం వీధి పరిధిలోని బోడిపాలెం వీధి వారు కొన్నేళ్లుగా మూడో వీధిగా ఉత్సవాలు ప్రారంభించారు. సాయంత్రం పై రెండు వీధులతో పాటు బాణసంచా కాలుస్తున్నారు. కొత్తపేటలో మంగళవారం సంక్రాంతి ప్రభల సంబరాలకు ఉత్సవ కమిటీలు భారీగా ఏర్పాట్లు చేశాయి.

ఉత్సవం జరుగుతుందిలా..

పాతరామాలయం వీధికి చెందిన ప్రధాన ప్రభ వీరభద్రస్వామిని, కొత్తరామాలయం వీధి ప్రధాన ప్రభ రాజరాజేశ్వరీదేవిని అలంకరించుకోగా ఆయా వీధులకు చెందిన మిగిలిన 12 ప్రభలపై వివిధ దేవతామూర్తులను అలంకరిస్తారు. ఈ ప్రభలతో ఉదయం నుంచీ ఆయా వీధుల్లో కోలాహలంగా భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో తొలుత పాత రామాలయం, తరువాత కొత్త రామాలయం వీధుల ప్రభలు.. గ్రామ పెద్దలు, ఆబాలగోపాలం వెంట రాగా.. మంగళ వాయిద్యాలు, బ్యాండుమేళాలు, బాణసంచా కాల్పుల నడుమ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణలకు చేరుకుంటాయి.

ఆకట్టుకోనున్న బాణసంచా కాల్పులు

ప్రభలను భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకూ వరుసగా బోడిపాలెం, పాత రామాలయం, కొత్త రామాలయం వీధుల వారు రకరకాల బాణసంచా కాల్పులు జరుపుతారు. అక్కడితో పగటి పూట ఉత్సవం ముగుస్తుంది. రాత్రి 10 గంటలకు ప్రభల తిరుగు ప్రయాణంతో రాత్రి ఉత్సవం ప్రారంభమవుతుంది. ఈ ఊరేగింపు అర్ధరాత్రి 2 గంటల సమయానికి పాత బస్టాండ్ సెంటరు చేరుకోగానే ఉత్సవంలో ప్రధాన ఘట్టమైన బాణసంచా కాల్పులు ప్రారంభిస్తారు. అక్కడ పాత, కొత్త రామాలయాల వీధుల వారు సుమారు 25 రకాల బాణసంచాలను కాలుస్తారు. అవి వెదజల్లే కాంతుల్లో ఆ ప్రాంతమంతా కొత్త శోభను సంతరించుకుంటుంది. ఉదయం 5 గంటలకు కాల్పులు పూర్తి కాగా, ఏ వీధి ప్రభలు ఆ వీధికి చేరుకోవడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

కనుమ ప్రభల ఉత్సవాలకు ఏర్పాట్లు

మండల పరిధిలోని మందపల్లి, వాడపాలెం, వానపల్లి గ్రామాలతో పాటు కొత్తపేట మండలం అవిడి, పి. గన్నవరం మండల పరిధిలోని పప్పులవారిపాలెం, అంబాజీపేట మండలం చిరతపూడి గ్రామాల కూడలి అవిడి డామ్ సెంటర్ వద్ద, జగ్గన్నతోట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో అనేక ప్రాంతాల్లో కనుమ పండగ (బుధవారం) నాడు ప్రభల ఉత్సవాలకు ఆయా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.


ప్రభల ఉత్సవంలో భారీ పోలీస్ బందోబస్తు

ఉత్సవ కమిటీలతో ఆర్డీఓ పి.శ్రీకర్, డివిజన్, మండల స్థాయి అధికారులు సమీక్షించారు. ఎక్కడా ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులకు సహకరించడంతో పాటు ఉత్సవ కమిటీలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. డీఎస్పీ గోవిందరావు పర్యవేక్షణలో రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్సై జి.సురేంద్ర, జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్‌ల అధికారులు, సిబ్బందితో పాటు స్పెషల్ పోలీస్ ఫోర్స్ పోలీస్‌తో బందోబస్తుకు చర్యలు తీసుకున్నారు.

దేశ, విదేశాల నుంచి అతిథుల రాక

కొత్తపేట ప్రభల ఉత్సవం అంటే దేశ, విదేశాల్లో స్థిరపడిన స్థానికులు, వారి బంధువులకు ఎంతో ఆసక్తి. బిజీగా ఉన్నప్పటికీ పనికట్టుకుని కొత్తపేట వస్తారు. సంక్రాంతి ప్రభల ఉత్సవంలో స్నేహితులు కలిసిన వేళ వారి ఆనందాలకు అవధులు ఉండవు. నాటి, నేటి కబుర్లతో సందడిగా గడుపుతారు. ప్రస్తుత యాంత్రిక జీవనంలో ఒక వారం రోజులు పాటు ఉపశమనంగా పీలవుతారు. ఈ సందర్భంగా వంశ వృక్షం పేరుతో కొన్ని కుటుంబాలు, అపూర్వ కలయిక పేరుతో విద్యాసంస్థల్లో కలిసి చదువుకున్నవారు కలుసుకుంటారు.

అలా మొదలైంది..



పూర్వం కొన్ని కుటుంబాల్లో వీరభద్రుడిని పూజించి, ఉత్సవాలు జరిపేవారు. క్రమంగా అది కాస్తా గ్రామ ఉత్సవంగా మారింది. మునసబు గారి ఇంట వీరభద్రునితో ప్రధాన (పాత రామాలయం) ప్రభతో సంక్రాంతి ప్రభల ఉత్సవంగా రూపాంతరం చెందింది. తరువాత భక్త రామదాసు మేనమామలైన అక్కన్న, మాదన్నలు హరి హర దేవాలయాలు నిర్మించగా.. ఆ ప్రాంగణంలో రాజరాజేశ్వరీదేవి ప్రధాన (కొత్త రామాలయం) ప్రభతో రెండో వీధి ఉత్సవాలు ప్రారంభించారు. ఇవి తొలుత పగటి పూటే జరిగేవి. సుమారు 150 సంవత్సరాల నుంచి రాత్రి పూట కూడా ఉత్సవాలు నిర్వహించడం ప్రారంభించారు. **– ముత్యాల వీరభద్రరావు, కన్వీనర్, కొత్త రామాలయం ఉత్సవ కమిటీ, కొత్తపేట**

మత సామరస్యానికి ప్రతీక కొత్తపేట ప్రభల ఉత్సవం



మతసామరస్యానికి ప్రతీక కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవం. ఇది హిందూ సంప్రదాయ ఉత్సవం అయినప్పటికీ అనాదిగా ఈ ఉత్సవంలో మతాలకు అతీతంగా అందరూ పాల్గొంటారు. సంక్రాంతి వస్తుందంటే మా పండుగ వస్తున్నట్టే భావిస్తాం. ఇక్కడ ప్రభల ఉత్సవం, బాణసంచా కాల్పులు తిలకించేందుకు మతాలకు అతీతంగా ఈ ప్రాంతీయులందరూ ఎంతో ఆసక్తి చూపుతారు. మేము సంక్రాంతి ప్రభల ఉత్సవాన్ని ఆనందంగా స్వాగతిస్తాం.

– షేక్ గౌస్, మండల ముస్లిం సంఘ నాయకుడు, కొత్తపేట

రత్నగిరిపై భక్తుల సందడి

- సత్యదేవుని దర్శించిన 30 వేల మంది
- 1,500 వ్రతాల నిర్వహణ
- రూ.30 లక్షల ఆదాయం

అన్నవరం: సంక్రాంతి సెలవుల కారణంగా రత్నగిరికి భక్తుల రద్దీ పెరిగింది. సత్యదేవుడిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించి పూజలు చేశారు. ఎక్కువ మంది కార్లు, ఇతర వాహనాల్లో రావడంతో దేవస్థానంలోని పార్కింగ్ స్థలాలన్నీ నిండిపోయాయి. స్వామివారిని 30 వేల మంది దర్శించుకున్నారు. ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు, అనంతరం సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. సత్యదేవుని వ్రతాలు 1,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు.

ఘనంగా రథసేవ

ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి టేకు రథంపై వేంచేయించారు. పూజల అనంతరం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు కొబ్బరి కాయ కొట్టి రథసేవ ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల ఘోష నడుమ స్వామి, అమ్మవారిని ఆలయ ప్రాకారంలో మూడుసార్లు రథంపై ఊరేగించి, తిరిగి ఆలయానికి చేర్చారు.

నేడు ప్రత్యంగిర హోమం

పుష్య పౌర్ణమి సందర్భంగా రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి ఉదయం 9 గంటల నుంచి ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నారు. పూర్ణాహుతి అనంతరం, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పిస్తారు. ఈ హోమంలో రూ.750 టికెట్టుతో భక్తులు పాల్గొనవచ్చునని అధికారులు తెలిపారు.




సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు



ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథసేవ

బోటులోనే మంచినీటి తయారీ



ప్రసన్న గైడ్ ప్రొఫెసర్ సందీప్ ఎస్.దేశ్‌ముఖ్



బోటులో సోలార్ డిస్టిలేషన్ మెషీన్ ఏర్పాటు చేస్తున్న ప్రసన్న

పిఠాపురం: విద్యుత్ అవసరం లేకుండా సౌరశక్తిని ఒడిసిపట్టి తక్కువ ఖర్చుతో సముద్రపు నీటిని మంచినీటిగా మార్చే సోలార్ డిస్టిలేషన్ పరికరాన్ని ఓ యువతి రూపొందించారు. రోజుల తరబడి సముద్రంలో చేపల వేట సాగించే మత్స్యకారులు మంచినీటి కోసం పడే ఇబ్బందులను తొలగించేందుకు దీనిని ఆవిష్కరించినట్టు వైఎస్ ప్రసన్న చెప్పారు. హైదరాబాద్ బిట్స్ పిలానీ క్యాంపస్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రసన్న పీహెచ్‌డీ పరిశోధనలో భాగంగా ఈ పరికరాన్ని తయారు చేశారు. దీంతో ఎలాంటి మురికి నీటినైనా మంచినీటిగా మార్చుకోవచ్చని చెప్పారు. పరిశోధనలో భాగంగా తాను తయారు చేసిన యంత్రాన్ని ఇటీవల కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద సముద్రంలో ప్రయోగాత్మకంగా బోటులో అమర్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇంట్లో కూడా నీటిశుద్ధి పరికరాలను అమర్చుకోవడం సాధారణంగా మారిపోయిందన్నారు. ఇప్పటి వరకూ అందుబాటులోకి వచ్చిన అనేక నీటిశుద్ధి యంత్రాలు అధిక ఖర్చుతో కూడుకున్నవన్నారు. ఈ నేపథ్యంలో అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ అవసరం లేకుండా ఎక్కడైనా.. ఎప్పుడైనా నీటిని శుద్ధి చేసుకునే యంత్రాన్ని తయారు చేయాలనే పట్టుదలతో సోలార్ డిస్టిలేషన్ మెషీన్ తయారు చేశానని ప్రసన్న చెప్పారు. సముద్రంలో రోజుల తరబడి చేపల వేట సాగించే మత్స్యకారులకు అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు వచ్చానన్నారు. ఈ యంత్రం విజయవంతంగా పని చేస్తోందన్నారు.

గోమూత్రం నుంచి సైతం..

తన ప్రొఫెసర్ సందీప్ ఎస్.దేశ్‌ముఖ్ ప్రోత్సాహంతో దీనిని తయారు చేశానని ప్రసన్న తెలిపారు. ఎక్కడ కావాలన్నా ఈ యంత్రాన్ని అమర్చుకోవచ్చన్నారు.

ఒక రోజుకు ఒక కుటుంబానికి అవసరమైనంత నీరు ఇందులో తయారవుతుందని చెప్పారు. ఈ యంత్రం ద్వారా రోజ్ వాటర్, జాస్మిన్ వాటర్, అత్తరు వంటి వాటితో పాటు ఆవు మూత్రాన్ని శుద్ధి చేసి గోమాత ఆర్కా (దీనిని ఆయుర్వేద మందుల తయారీలో ఉపయోగిస్తారు) తయారు చేయవచ్చని వివరించారు. గోమూత్రాన్ని ఒకసారి వేస్తే గోమాత ఆర్కా వస్తుందని, మూడుసార్లు వేస్తే పూర్తిగా శుద్ధి జరిగి మంచినీటిగా మారుతుందని చెప్పారు. ప్రభుత్వం సహకరిస్తే ఈ మెషీన్‌ను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. ఇప్పటివరకూ చాలా పరికరాలు అందుబాటులోకి వచ్చినా ఎటువంటి అదనపు ఖర్చు, వృథా లేకుండా రూపొందించిన మొట్టమొదటి చిన్న పరికరం ఇదేనని ఆమె చెప్పారు.


అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

కోడి పందేలలో కోసమెరుపు!

- కోస మాంసానికి భలే గిరాకీ
- బరిలో ఎక్కువ మొత్తం ఇందు కోసమే ఖర్చు
- ఇప్పటి నుంచే ఆర్డర్లు
- గాట్లు ఉన్న ప్రతీది కోస కాదు



పిఠాపురం: మరో నాలుగు రోజుల్లో కోడిపందేలు ప్రారంభం కానున్నాయి. కోడిపందేలు ఆడేవారి కంటే ఓడిన కోడి మాంసం కోసం ఎదురుచూసేవారే ఎక్కువ. ఏనుగు చచ్చినా వెయ్యే బతికినా వెయ్యే అనేది సామెత. అలాగే పందెం కోడి చచ్చినా బతికినా రూ.వేల ఖరీదు చేస్తుంది. చచ్చే వరకు పోరాడి తమ యజమానికి రూ.లక్షల్లో ఆదాయాన్ని తెచ్చిపెట్టే పందెం కోడి చచ్చిన తరువాత రూ.వేలల్లో ఆదాయాన్ని సమకూరుస్తుంది. ఏ నోట విన్నా డబ్బు ఎవరికి కావాలి ముందు కోసమాంసం పంపించు అంటున్నారు. పందెం రాయుళ్లు తమ బంధువులకు, రాజకీయ నాయకులకు, అధికారులకు పండగ గిఫ్ట్‌గా కోస మాంసం పంపిస్తుంటారు. ప్రతి కోడిపందేల బరి దగ్గరా కోసలను కాల్చి మాంసం నరికే దుకాణాలు వెలిశాయి. తొలిరోజు భోగి నాడు ప్రారంభమైన కోడిపందేల్లో వందల కోళ్లు పందెంలో పాల్గొనసుండగా వందల కిలోల కోస మాంసం సిద్ధం అయింది. కోస మాంసం గత ఏడాది కిలో రూ.500 నుంచి రూ.1,000 వరకు పలికింది. ఈ ఏడాది మరింత ప్రియం కానుందని చెబుతున్నారు. పందెంలో ఓడిన కోడిని ఎక్కువగా దెబ్బ తినక పోతే మళ్లీమళ్లీ పందెం కాస్తుంటారు చివరకు అది చనిపోతే దానిని కాల్చి తరువాత కోసిన మాంసంను వండుకుంటారు. ఈ మాంసం కొవ్వులేకుండా రుచిగా, బలవర్ధకంగా ఉంటుండడంతో ఎక్కువ మంది దీనికోసం ఉర్రూతలూగుతారు.

పెంపకం వల్లే విలువ

పందెం కోళ్లను కొన్ని నెలలపాటు బాదం, పిస్తా, జీడిపప్పు వంటి బలవర్ధకమైన ఆహారంతో పాటు ప్రతీ రోజు వ్యాయామం చేయిస్తూ పెంచడం వల్ల ఎక్కడా కొవ్వు లేకుండా ఉండడం వల్ల ఈ మాంసం చాలా బలవర్ధకంగా, రుచిగా ఉంటుంది. కండలు తేరి అత్యంత బలంగా తయారైన ఈ కోళ్లలో మాంసం చాలా గట్టిగా ఉంటుంది. వీటి ఎముకలను మాంస ప్రియులు ఇష్టంగా తింటారు.

కోసలో మోసం

సాధారణంగా పందెంలో ఓడిన కోడి మాంసంనే కోస మాంసంగా తింటారు. పందెంలో ఓడిన కోడికి కత్తి గాట్లు ఉంటాయి. కాని పందెం నిర్వాహకులు ఇతరులకు పంపించేందుకు సరి కొత్త కోసలను తయారు చేస్తుంటారు. ఏ పందెంలో పాల్గొనని కోళ్లను చంపి వాటికి కత్తి గాట్లు పెట్టి నిజంగా పందెంలో ఓడిన కోడిగా చిత్రీకరించి దానిని ఇతరులకు పంపించడం కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ మందికి నకిలీ కోసలు పంపించే విధంగా ఏర్పాట్లు చేయడం పరిపాటిగా మారింది. నిజమైన కోస రూ.వేలల్లో ఉంటే తయారు చేసిన కోస రూ.వందల్లో మాత్రమే ఉంటుంది. మాంసంలోను చాలా తేడా ఉంటుంది. చూసేవారికి మాత్రం తయారు చేసిన కోడి కూడా కోస మాదిరిగానే కనిపిస్తుంది.

ఇప్పటి నుంచే ఆర్డర్లు.. ఆఫర్లు

త్వరలో ప్రారంభం కానున్న కోడి పందేల్లో తమకు కోస మాంసం పంపించాలంటూ పలువురు నేతలు, అధికారులు తమ అనుచరులకు ఆర్డర్లు వేస్తున్నారు. ప్రతీ బరి నుంచి అధికారులకు, ప్రజాప్రతినిధులకు కోస మాంసం పంపించాలనే షరతు విధించడంతో నిర్వాహకులు వాటి కోసం కొంత సొమ్ము కేటాయిస్తున్నారు. బరుల నిర్వహణకు రూ.లక్షల్లో ఖర్చు అవ్వనుండగా వాటిలో ఎక్కువ మొత్తం పెద్దలకు కోస మాంసం పంపడానికే కేటాయించాల్సి ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. ఒక్కో బరి నుంచి సుమారు 50 కోళ్ల వరకు కోస మాంసం కోసం కొని ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని నిర్వాహకులు చెబుతున్నారు.

ఐపీఎల్ క్రికెటర్‌కు ఘన స్వాగతం



గోగన్నమఠం వచ్చిన క్రికెటర్లు సత్యనారాయణరాజు, పాండురంగరాజు

మామిడికుదురు: ఐపీఎల్ ముంబయి జట్టు క్రికెటర్ సత్యనారాయణరాజు ఆదివారం తన స్వగ్రామం మామిడికుదురు మండలంలోని గోగన్నమఠం వచ్చారు. గ్రామంలోని సత్తెమ్మ తల్లి, ధనమ్మ తల్లితో పాటు వేంకటేశ్వర స్వామిని ఆయన దర్శించుకున్నారు. అతనితో పాటు అతని సోదరుడు రంజీ క్రికెట్ క్రీడాకారుడైన పాండురంగరాజు కూడా వచ్చారు. వీరికి స్థానికులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. భారత క్రికెట్ జట్టుకు ఎంపిక కావాలని సత్యనారాయణరాజును ఆశీర్వదించారు. వైస్ ఎంపీపీ భూపతిరాజు లక్ష్మి, గ్రామ ప్రముఖులు భూపతిరాజు సత్తిబాబురాజు, సాగి పీఆర్‌వీఎ స్ఎస్ నర్సింహవర్మ (బాబు), సాగి సత్యనారాయణరాజు, భూపతిరాజు సతీష్‌రాజు ఉన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఆల్ ఇండియా మహిళా వాలీబాల్ పోటీలు

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెం గ్రామంలోఅడబాల స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా మహిళా వాలీబాల్ పోటీలు సోమవారం నుంచి ప్రారంభం అవుతాయని నిర్వాహకులు ఆర్గనైజింగ్ కమిటీ తరఫున అడబాల వేణుగోపాల ఆదివారం తెలిపారు. 17వ తేదీ వరకూ జరిగే ఈ పోటీలకు దేశం నలు మూలల నుంచి పేరొందిన క్రీడాకారులు హాజరవుతారని వివరించారు.

బ్యాగ్‌లో ఆభరణాల చోరీ

కొవ్వూరు: పట్టణంలో 12వ వార్డుకి చెందిన వేగేశ్న రమాదేవికి చెందిన ఏడు కాసుల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. శనివారం కొవ్వూరు నుంచి బయల్దేరి నూజివీడు వెళ్లేందుకు బ్యాగ్‌లో దుస్తులు సర్దుకున్నారు. ఆభరణాలు పెట్టుకునే బాక్స్‌లో మూడు కాసుల నక్లెస్, నాలుగు కాసుల చంద్రహారం ఉంచి చీర మధ్యలో సర్దారు. నూజివీడు వెళ్లిన తర్వాత బ్యాగ్ తెరిచి చూడగా ఆభరణాలు కనిపించలేదు. తాను ఇంటి వద్ద బయల్దేరిన సమయంలో ఇద్దరు మహిళలు సహాయ పడినట్టు పేర్కొన్నారు. దీంతో ఆ సమయంలోనే ఆభరణాలు గల్లంతై ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు బాధితురాలు తెలిపారు.

అమలాపురంలో భారీ చోరీ

- రూ.10.50 లక్షల సొత్తు దోపిడీ
- క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లతో ఆధారాల సేకరణ

అమలాపురం టౌన్: స్థానిక కురసాలవారి వీధిలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ చోరీ జరిగింది. కోలా శేషు ఇంట్లో దొంగలు చొరబడి రూ.10.50 లక్షల సొత్తు దోచుకున్నారు. 30 కాసుల బంగారు వస్తువులు, రూ.1.50 లక్షల నగదు చోరీకి గురైంది. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లు రంగంలోకి దిగాయి. చోరీ జరిగిన ఇంట్లో క్లూస్ టీమ్ ఆధారాలు సేకరిస్తే, ఆ ఇంటి పరిసరాలను డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేసింది. ఘటనా స్థలాన్ని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు సందర్శించి చోరీకి దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు.

చోరీ జరిగిందిలా..

కోలా శేషు ఇంట్లోకి దొంగలు తలుపులు బద్దలకొట్టుకుని ప్రవేశించారు. శేషు భార్య, పిల్లలు సంక్రాంతి పండగలకు పుట్టింటికి వెళ్లారు. తాను ఓ బెడ్ రూమ్‌లో నిద్రించగా మరో గదిలో శేషు తల్లి నిద్రించారు. బెడ్ రూమ్‌లో బీరువా తాళాలు వేయకపోవడం, బీరువాకు ఉన్న లాకర్ తాళాలు అక్కడే ఉండడంతో దొంగలకు పని సులువైంది. శేషు అర్ధరాత్రి వరకూ టీవీ చూసి పడుకున్నారు. తెల్లవారు జాము 3 గంటలకు బాత్ రూమ్‌కు వెళదామని లేచే సరికి బీరువా తలుపులు తెరచి ఉండడంతో అనుమానం వచ్చి ఇంటిని ఓసారి పరికించారు. చోరీ గురైనట్లు, బీరువాలోని బంగారు నగలు, నగదు దోచుకున్నట్లు గుర్తించారు. చోరీ జరిగిన ఇంటికే కాకుండా ఆ పరిసరాల్లో సీసీ కెమెరాలు లేకపోవడం కూడా దొంగలను త్వరగా గుర్తించే అవకాశం లేకుండా పోయింది. శేషు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.



చోరీకి గురైన ఇంట్లో దొంగల వేలి ముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీమ్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సత్యనారాయణ(ఫైల్)

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం శివారు సూర్యనారాయణపురం వద్ద గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం బిక్కవోలు మండలం ఊలపల్లికి చెందిన ఖండపల్లి సత్యనారాయణ(25) కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. సత్యనారాయణ తాపీపని చేస్తూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటుండగా, చిన్నాన్న పలుపులియ్య వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. వీరితో పాటు గ్రామానికి చెందిన మరొక 20 మంది హైదరాబాద్‌లో ఉంటున్నారు. సంక్రాంతి సందర్భంగా వారందరూ శనివారం రాత్రి సొంతూరుకు బయలుదేరారు. మృతుడు సత్యనారాయణ, తన చిన్నాన్న బైక్‌పై బయలుదేరగా, మిగిలిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సుమారు 20 మంది వ్యాన్‌లో బయలుదేరారు. బైక్‌పై వస్తున్న సత్యనారాయణ, చిన్నాన్న ఉదయం 6 గంటల సమయంలో సూర్యనారాయణపురం వద్దకు చేరుకోగా, బైక్ వెనుక కూర్చున్న సత్యనారాయణ కునుకుపాట్లు పడడంతో బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తూ జారి పక్కన గల ఇనుప డివైడర్‌పై పడ్డాడు. తలకు బలమైన గాయం కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక వ్యాన్‌లో వస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సత్యనారాయణ మృతదేహాన్ని గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సత్యనారాయణ

హెల్మెట్ ధరించినా వీడని మృత్యువు

మృతుడు సత్యనారాయణ, చిన్నాన్న తలకు హెల్మెట్లు ధరించినప్పటికీ మృత్యువు వీడలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. దూర ప్రయాణం కావడంతో ఇరువురు తలకు హెల్మెట్లు ధరించి వస్తున్నారు. అయితే హెల్మెట్ బెల్టు పెట్టకపోవడంతో హెల్మెట్ పడిపోయినట్టు సమాచారం. తెల్లవారు జామున 5 గంటల సమయంలో నల్లజర్ల సెంటర్లో ఆగి టీ తాగి బయలుదేరినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నిద్రమత్తే ప్రమాదానికి కారణమని కుటుంబ సభ్యులు తెలిపారు. మరొక రెండు గంటల్లో ఇంటికి చేరుకునే వారని ఇంతలోనే మృత్యువు కబళించిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సత్యనారాయణకు పెండ్లి నిశ్చయం కాగా, మరొక నెల రోజుల్లో వివాహం జరగవలసి ఉంది. సంక్రాంతి వేళ సత్యనారాయణ ఇంటిలో విషాదం నెలకొంది.

తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు

బిక్కవోలు: తన ఒక్కగాని ఒక్క కొడుకు పండగకి ఇంటి వస్తున్నాడని ఎంతో ఆశగా ఎదురుచూసిన తల్లి అన్నవరం, తండ్రి వీరబాబుకు తీరని వేదన మిగిలింది. కుటుంబాన్ని ఆదుకోవడానికి కూలి పనిచేస్తున్న తమ కుమారుడు పండగకు ఇక్కడకు వస్తున్నట్టు హైదరాబాద్‌లో బయలుదేరి ముందు ఫోన్ చేశాడని వారు మురిసిపోయారు. తీరా ఇలా మార్గమధ్యంలోనే కడతేరిపోయాడన్న చేదు నిజాన్ని ఆ తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు. కుమారుడి మృతదేహం వద్ద తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది. అందరితో సరదాగా గడిపే ఆ యువకుడు ఇక లేడు అన్న విషయాన్ని ఊలపల్లి గ్రామస్తులు జీర్ణయించుకోలేపోతున్నారు.



సత్యనారాయణ మృతదేహం వద్ద కన్నీరు మున్నీరు అవుతున్న తల్లిదండ్రులు

ఆనాటి హృదయాల ఆనంద గీతం

57 ఏళ్ల పూర్వ విద్యార్థుల కలయిక



పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో ఒకే వేదికపై 55 ఏళ్లనాటి పూర్వపు విద్యార్థులు

అంబాజీపేట: పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో 1968–69లో ఎస్ఎస్ఎల్‌సీ లాస్ట్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 57 ఏళ్ల నాటి అనుభూతులను నెమరు వేసుకున్నారు. బాల్యంలో చేసిన చిలిపి చేష్టలు.. చెట్ల కింద చదువులు, గత జ్ఞాపకాలు, సరదాలు, షికార్లు.. ఆపద సమయంలో ఆపన్న హస్తం అందించిన తోటి మిత్రుల ఔదార్యం వంటి ఘటనలు గుర్తుకు రావడంతో పూర్వ విద్యార్థులు పులకరించిపోయారు. 70 ఏళ్ల పైబడి వయసు ఉన్నవారు వారి వృద్ధాప్యాన్ని మరచిపోయి చిన్నపిల్లల్లా మారిపోయి సందడి చేశారు. తమకు చదువు చెప్పిన ఇరువురు ఉపాధ్యాయులను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. తాము చదువుకునే సమయంలో రెండు సెక్షన్‌లలో 70 మంది విద్యార్థులు ఉండేవారమని, ఈ ఆత్మీయ కలయికకు 55 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

కండగారవం

జిల్లా బాడీ బిల్డింగ్ పోటీల ప్రారంభం



అమలాపురంలో జరిగిన యునైటెడ్ డిస్ట్రిక్ట్ జోనల్ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో కండలను ప్రదర్శిస్తున్న బాడీ బిల్డర్స్

అమలాపురం టౌన్: జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆదివారం రాత్రి యునైటెడ్ డిస్ట్రిక్ట్ జోనల్ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా మొదలయ్యాయి. పోటీలను అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, హైదరాబాద్, విశాఖ మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ సందెపు వెంకటేశ్వరావు, గంధం పల్లంరాజు ప్రారంభించారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు పోటీలను పర్యవేక్షించారు. పోటీలకు అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి 200 మంది వరకూ బాడీ బిల్డింగ్ క్రీడాకారులు హాజరై తమ కండలను ప్రదర్శించారు. ఈవెంట్ ఆర్గనైజర్‌గా ఆశెట్టి ఆదిబాబు వ్యవహరించారు. స్థానిక హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు పోటీలను నిర్వహించారు. మొత్తం 10 కేటగిరీల్లో మెన్, మాస్టర్స్, దివ్యాంగులు, ఫిజిక్స్ స్పోర్ట్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీలు ఆదివారం అర్ధరాత్రి వరకూ జరిగే అవకాశం ఉండడంతో విజేతలను పేర్లను జిల్లా అసోసియేషన్ ప్రకటించలేదు. రాత్రి 8 గంటల సమయంలో కూడా పోటీలు ఉత్కంఠగా జరిగాయి. బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గారపాటి శేఖర్, పోటీల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మట్టపర్తి సముద్రం, నార్ని శ్రీను,చిక్కం రాజబాబు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీలకు పాల్పడుతున్న ముఠా పట్టివేత

ముగ్గురిని అదుపులోకి తీసుకున్న గోకవరం పోలీసులు

గోకవరం: ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని గోకవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై గోకవరం పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ దేవకుమార్ వివరాలు వెల్లడించారు. గుంటూరుకు చెందిన శ్యాంసన్, బెనర్జీ, గణేష్, రాకేష్ ఈ నెల 10న అర్ధరాత్రి సమయంలో గోకవరంలోని ఎస్‌బీఐ వద్ద ఉన్న ఏటీఎంలో చోరీకి యత్నిస్తున్నారు. ఆ సమయంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులను చూసి వారు అక్కడి నుంచి పరారయ్యారు. బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు నంబర్ సహాయంతో కోరుకొండ సీఐ సత్యకిశోర్, గోకవరం ఎస్సై పవన్‌కుమార్, కోరుకొండ, సీతానగరం పోలీసు సిబ్బంది వేర్వేరు బృందాలుగా ఏర్పడి గాలించారు. ఈ క్రమంలో మండలంలోని గుమ్మళ్లదొడ్డి శివారున వీరి కారుని గుర్తించిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని కారుని సీజ్ చేశారు. ప్రధాన నిందితుడు శ్యాంసన్ తప్పించుకున్నాడని, వీరు నలుగురు రంపచోడవరంలోని బంగారు నగల దుకాణం చోరీకి వెళుతూ మార్గమధ్యలో ఏటీఎం చోరీకి యత్నించినట్టు విచారణలో వెల్లడయ్యిందని డీఎస్పీ తెలిపారు. శ్యాంసన్ ప్రధాన నిందితుడని, గణేష్ కారుని అద్దెకు తీసుకోగా, బంగారం దొంగతనం చేసిన తరువాత దాన్ని మార్చేందుకు రాకేష్, వీరి ముగ్గురిని కోఆర్డినేట్ చేసిన బెనర్జీ ముఠాగా ఏర్పడి నేరాలకు పాల్పడుతున్నారన్నారు. శ్యాంసన్‌పై పిడుగురాళ్లలో కేసు ఉందన్నారు. త్వరలో ప్రధాన నిందితుడిని కూడా అరెస్టు చేస్తామని, వీరి అరెస్టుతో పలు నేరాలు జరగకుండా నివారించగలిగామన్నారు. వీరిని విచారిస్తే మరిన్ని నేరాల వివరాలు తెలిసే అవకాశం ఉందన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబర్చిన సీఐ సత్యకిశోర్, ఎస్సై పవన్‌కుమార్, ఇతర సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



ఏటీఎం చోరీకి పాల్పడిన నిందితులతో డీఎస్పీ, సీఐ, ఎస్సై, ఇతర సిబ్బంది

కోడిపందేల బరుల ధ్వంసం



ఒమ్మంగిలో బరులను ధ్వంసం చేయించిన ఎస్సై, సిబ్బంది

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగి, శరభవరం గ్రామాల్లో కోడి పందేల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన బరులను స్థానిక ఎస్సై లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో పోలీసులు ఆదివారం ధ్వంసం చేశారు. సంక్రాంతిని పురస్కరించుకొని మూడు రోజులపాటు కోడి పందేలు నిర్వహించేందుకు టెంట్లు, లైటింగ్‌లు ఏర్పాటు చేశారు. వీటి సమాచారం తెలుసుకున్న ఎస్సై లక్ష్మీకాంతం తమ సిబ్బందితో వెళ్లి బరులను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి వేళ సంప్రదాయ క్రీడలకు మాత్రమే పరిమితం అవ్వాలని జూదాలు ఆడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

పిఠాపురంలో ఆర్చరీ పోటీలు

పిఠాపురం: స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్చరీ పోటీలు ఆదివారం నిర్వహించారు. జూనియర్ బాయ్స్ అండ్ గరల్స్ చాంపియన్ షిప్ పోటీలను ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకె జగదీష్, విరవాడ సర్పంచ్ బోయి నాగేశ్వరరావు, ఆర్చరీ అసోసియేషన్ సభ్యులు సోము గోవిందరాజు, కె. చిన్నబ్బాయి, జె.ప్రసాదరావు ప్రారంభించారు. ఈ పోటీలలో 45మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఆరుగురు బాలురు, ఆరుగురు బాలికలను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 23 నుంచి 25 వరకు విజయవాడలో జరుగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ ఆర్చరీ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఇండియన్ రౌండ్ విభాగంలో పాల్గొంటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావు, కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, 15వ వార్డు కౌన్సిలర్ రాయుడు శ్రీనివాసరావు, అభ్యుదయ ఫౌండేషన్ తరఫున బాదం సూర్యప్రకాష్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమిడిసెట్టి నాగేంద్ర కుమార్ బహుమతి ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా జి.శివప్రసాద్, పి.సాయి, బి నవీన్, వంశీ వ్యవహరించారు.



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఒడిశా కూలీ మృతి



సామర్లకోటలో మృతదేహాన్ని పరిశీలించిన సీఐ

సామర్లకోట: ఒడిశా రాష్ట్రం రాయగడకు చెందిన కూలీ రోడ్డుపై పడి మృతిచెందిన ఘటన ఇది. విషయం తెలుసుకున్న సీఐ ఎ.కృష్ణభగవాన్ ఘటనా ప్రదేశానికి చేరుకొని వివరాలు సేకరించారు. సీఐ కథనం ప్రకారం రాయగడ నుంచి కూలీ పనికోసం వచ్చిన హరిష్ చంద్ర కద్రిక (30) స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న వివిధ హోటల్స్‌లో పని చేసే వాడు. స్టేషన్ సెంటర్‌లో ఆదివారం నడుచుకొంటూ వస్తూ బేకరీ ఎదురుగా పడి పోయాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా వచ్చిన సిబ్బంది చనిపోయాడని నిర్ధారించారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పెద్దాపురం మార్చురీకి తరలించారు.

240 కోడికత్తుల స్వాధీనం

గోకవరం: సంక్రాంతి పండగ ముసుగులో కోడిపందేలకు కత్తులను తయారు చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు కోరుకొండ సీఐ సత్యకిశోర్ తెలిపారు. ఆదివారం ఆయన గోకవరం పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మండలంలోని కృష్ణునిపాలెం గ్రామ శివారున అల్లూరుసీతారామరాజు జిల్లా గంగవరం మండలం ఓజుబందకు చెందిన అగర్తి బాలయ్య, తొట్టిపూడి నాగులు కలిసి కోడికత్తులు తయారు చేస్తుండగా ఎస్సై పవన్‌కుమార్ సిబ్బందితో వెళ్లి దాడి చేసి వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి నుంచి 240 కోడికత్తులు, రెండు విద్యుత్ మోటార్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.



స్వాధీనం చేసుకున్న కోడికత్తులతో సీఐ సత్యకిశోర్, ఎస్సై పవన్‌కుమార్